తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

# పేదల పక్షిపాతి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం :ఎమ్మెల్యే



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. దేశంలోనే అత్యధిక పెన్షన్ ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకే దక్కుతుందని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఆటోనగర్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో మంగళ వారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నగరంలో 18 వేల 146 మందికి 8 కోట్ల రెండు లక్షలా యాభై వేల రూపాయలు ప్రతి నెలా అందిస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మూడు వేల నుంచి నాలుగు వేలకు పెన్షన్‌ను ఒకేసారి పెంచి లబ్ధిదారులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రెండు వేల నుంచి మూడు వేలకు పెంచేందుకు ఐదేళ్ళు తీసుకుందని ఆయన విమర్శించారు. పేదలను ఆర్థిక భరోసా కల్పించే చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా ను ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఆయన తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికి సమ ప్రాధాన్యత ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి ఇస్తున్నారని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి, లోకేష్‌లు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మాజీ కార్పొరేటర్ అన్నా అనితలు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు...

# తిరుమల ముస్తాబు

### -15నుండి వాహనసేవలు



**ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల:**

శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలకొండ సిద్ధమవుతోంది. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 15నుండి 23 వరకు జరిపించనున్నారు. అధికమాసం వస్తే రెండుదఫాలు (సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ మాసంలో, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ మాసంలో) నిర్వహిస్తారు. ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు తిరుమలలో నిర్వహించ నున్నారు. అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవలవీక్షణకు సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు రూపొందించి అమలుచేయిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేశారు. సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు కూడా రద్దయ్యాయి. సాలకట్ల బహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 14న రాత్రి అంకురార్పణ, 15వతేదీ ధ్వజారోహణం నిర్వహిస్తారు. తొలిరోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమలకు చేరుకుని శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సెప్టెంబర్ 14న రాత్రి అంకురార్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరగనున్నాయి. టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి.



టీటీడీ అదనపు ఈవో

**తిరుమలలో లగేజీ వ్యవస్థపై అదనపు ఈవో సమీక్ష:**

తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లగేజీ నిర్వహణ వ్యవస్థలో తీసుకురానున్న మార్పులపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మంగళవారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు నూతన విధానం గురించి అదనపు ఈవోకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రూపొందించిన ఈ విధానంలో భక్తుల లగేజీని స్వీకరించినప్పటి నుంచి తిరిగి అందజేసే వరకు ప్రతి దశను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించే విధానాన్ని వివరించారు. ఈ విధానం ద్వారా అలిపిరి వద్ద భక్తుల లగేజీని స్వీకరించడం, ట్యాగ్‌ను అనుసంధానం చేయడం, వాహనాల ద్వారా తిరుమలకు తరలించడం, జీఎన్‌సీ వద్ద లగేజీని నిల్వ చేయడం, భక్తులు లగేజీని తిరిగి తీసుకునే వరకు మొత్తం ప్రక్రియను ఎండ్‌టుఎండ్ ట్రాక్ చేసే అవకాశం ఉంటుంది. రోజుకు సుమారు 12 వేల బ్యాగులను, రద్దీ సమయాల్లో గంటకు సుమారు 1,800 బ్యాగులను నిర్వహించే విధంగా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి లగేజీకి ట్యాగ్‌ను అనుసంధానం చేయడం ద్వారా అది ఏ ప్రాంతంలో ఉందో నిరంతరం గుర్తించే విధానం, భక్తులు లగేజీని తిరిగి పొందే సమయంలో క్యూలను తగ్గించేందుకు ముందస్తు రిక్వెస్ట్ చేసే విధానాన్ని జీఎంఆర్ ప్రతినిధులు వివరించారు. జీఎన్‌సీకి సుమారు 100 మీటర్ల పరిధిలో ఉన్నప్పుడు కియోస్క్ లేదా మొబైల్ యాప్ ద్వారా లగేజీ కోసం రిక్వెస్ట్ చేసుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా నేరుగా కౌంటర్ వద్ద కూడా రిక్వెస్ట్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలిపిరి నుంచి జీఎన్‌సీ వరకు లగేజీ తరలింపును కూడా డిజిటల్ మానిఫెస్ట్, జిపిఎస్ తదితర సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించే విధానాన్ని ప్రతిపాదించారు. లగేజీ నిర్వహణకు సంబంధించిన ఆక్యుపెన్సీ, భక్తుల రాకపోకలు, రద్దీ, సేవల స్థితి తదితర అంశాలను ఒకే కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ నూతన లగేజీ నిర్వహణ విధానం ద్వారా భక్తులకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన సేవలు అందించడంతో పాటు లగేజీ భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బంది సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ ఐటీ జీఎం వేంకటేశ్వర్లు నాయుడు, వి ఎస్ ఓ సిరేంద్ర ఇతర అధికారులు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

**అంతరాయం లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ:**

బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తిరుమల ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటు న్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ఘాట్ రోడ్లలో వాహనాలు నడిపేటప్పుడు వేగ నియంత్రణ, లేన్ క్రమశిక్షణ, ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వంటి అంశాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మంగళవారం సాయంత్రం టిటిడి రవాణావిభాగం సిబ్బందితో తిరుమల ట్రాఫిక్ సిఐ పి.హరిప్రసాద్. సిబ్బందితో కలసి రాబోవు స్వామివారి బ్రహ్మోత్సవాలలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. రవాణ కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, హెల్పర్లు, ఘాట్ రోడ్ మొబైల్స్ సిబ్బంది, టోయింగ్ వాహనాల డ్రైవర్లు, క్రేన్ డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వాహనాలు రోడ్డుపై నిలిచిపోయినప్పుడు వెంటనే స్పందించి, టోయింగ్ వాహనాలు క్రేన్ల సహాయంతో వాటిని సురక్షితంగా పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ పోలీసు, టిటిడి ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## అమరావతితో పాటు...

# అన్ని ప్రాంతాలు అభివృద్ధి

### - నీటిపారుదల రంగంపై సిఎం ప్రత్యేక దృష్టి
### - చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు రాజధాని అమరావతి నగర ంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబు నీటిపారుదల రంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గోదావరి, కృష్ణామిగులు జలాలను వినియోగించుకునే ఆలోచన చేస్తున్నారన్నారు. కృష్ణాజలాలను వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలోని పలు ప్రాంతాలకు తీసుకొచ్చా రన్నారు. కృష్ణా, గోదావరి జలాలను ట్రిబ్యునల్ ఆదేశాలతో పంచుకుంటున్నా మన్నారు. గోదావరి మిగులు జలాలపై ఎగువ రాష్ట్రాలు సానుకూల ంగా స్పందించడంతో పాటు ట్రిబ్యునల్ అనుమతిస్తే రాయలసీమ ప్రాంతానికి మరిన్ని నీళ్లు వస్తాయన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని బంగారు రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, డిఫెన్స్ ఎయిర్‌స్ట్రిప్ యూనిట్, రాయల్ ఎన్‌ఫీల్డ యూనిట్ తదితరాలను సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తీసుకువచ్చారన్నారు. అభివృద్ధిపై వైకాపా విమర్శలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు మా త్రమే అయిందనే విషయం గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నిరుద్యోగయువతకు మెగా డిఎస్సీ నిర్వహించామన్నారు. అలాగే ఇటీవలే పదివేల ఉద్యోగాలతో జాబ్ కేలండర్ ప్రకటించామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఎంపి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యురాలు సుగుణమ్మ, రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, ఎంసి వైస్‌ఛైర్మన్ శరవణ, ఆస్పత్రి కమిటీ సభ్యులు డాక్టర్ ప్రశాంత్ గౌడ, రాధ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా పరిశ్రమల...

# బలోపేతానికి ముందడుగు

### -తిరుపతి ఐఐటీలో వెల్డింగ్ పరిశోధనా కేంద్రం ప్రారంభం

శ్రీకాళహస్తి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: విద్యా, పరిశ్రమల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఐఐటీ తిరుపతి మరో ముందడుగు వేసిందని డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ అన్నారు. పరిశోధన, సాంకేతికత మరియు నైపుణ్యాభివృద్ధిలో సహకారాన్ని పెంపొందించేందుకు ప్రముఖ సంస్థ లింకన్ ఎలక్ట్రిక్ ఇండియా తో ఐఐటీ తిరుపతి ఐఐటీ ఒప్పందం కుదుర్చుకుందని ఆయన వివరించారు. మంగళవారం తిరుపతి క్యాంపస్ లో అత్యాధునిక వెల్డింగ్ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించాయి. పరిశ్రమలతో ఐఐటీ తిరుపతి భాగస్వా మ్యాలలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని అభిప్రాపయడ్డారు. లింకన్ ఎలక్ట్రిక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శివపాతసుందరం కాజా ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ సంయుక్తంగా వెల్డింగ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో ఏర్పాటు చేసిన గుర్తింపు ఫలకాన్ని ఆవిష్కరించడంతో ఈ కేంద్రం అధికారికంగా ప్రారంభమైంది. ఈ భాగస్వామ్యానికి నిర్వచనం ఇచ్చే సహకార స్ఫూర్తికి ప్రతీకగా ఈ ఆవిష్కరణ నిలిచిందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ వెల్డింగ్ పరిశోధనా కేంద్రాన్ని వెల్డింగ్ సంబంధిత సాంకేతికతలలో సహకార పరిశోధన, శిక్షణ మరియు నైపుణ్యాభివృద్ధి కోసం ఒక అంతర్విభాగ, సంస్థాగత స్థాయి కేంద్రంగా రూపొందించాలని సంకల్పించామన్నారు. ఈ కేంద్రం ఐఐటీ విద్యా, పరిశోధన సామర్థ్యాలను లింకన్ ఎలక్ట్రిక్ ఇండియా యొక్క పారిశ్రామిక నైపుణ్యంతో ఏకం చేస్తుందన్నారు. అదే సమయంలో వెల్డింగ్ మరియు అనుబంధ రంగాలలో ఎదురవుతున్న సవాళ్ళు, అవకాశాలపై అధ్యాపక సభ్యులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు పారిశ్రామిక భాగస్వాములు కలిసి పనిచేయడానికి ఒక వేదికను అందిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో లింకన్ ఎలక్ట్రిక్ ఇండియా నాయకత్వంతో పాటు టాటా స్టీల్ లిమిటెడ్, విప్రో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్, విప్రో హైడ్రాలిక్స్, ఎల్ అండ్ టి ప్రెసిషన్ ఇంజనీరింగ్ అండ్ సిస్టమ్స్, ఫ్రంట్ లైన్ టెక్సోల్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్స్ట్ జెన్ ప్లాస్మా ప్రైవేట్




లిమిటెడ్, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ వెల్డింగ్ నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక ప్రజెంటేషన్, చర్చా సమావేశం కూడా జరిగింది. పాల్గొన్న పారిశ్రామిక ప్రతినిధులు అభివృద్ధి చెందుతున్న వెల్డింగ్ టెక్నాలజీ అవసరాలు, మానవ వనరులు, నైపుణ్యాల కొరత కేంద్రంతో సహకరించుకోవడానికి గల సంభావ్య రంగాలపై తమ దృక్పథాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ వెల్డింగ్ టెక్నాలజీలలో ప్రపంచ అగ్రగామి అయిన లింకన్ ఎలక్ట్రిక్ సహకారంతో వెల్డింగ్ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల ఐఐటీ ఎంతో ఉత్సాహంగా ఉందని అన్నారు. ఈ కేంద్రం వెల్డింగ్ మరియు సంబంధిత రంగాలలో అత్యాధునిక సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి, అమలు చేయడానికి విద్యార్థులు, పరిశోధకులు మరియు పరిశ్రమ కలిసి పనిచేయడానికి ఒక వేదికను అందిస్తుందని తెలిపారు. లింకన్ ఎలక్ట్రిక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శివపాతసుందరం కాజా మాట్లాడుతూ శాస్త్రీయ ఆవిష్కరణకు మరియు పారిశ్రామిక అనువర్తనానికి మధ్య వారధిని నిర్మించడం, అదే సమయంలో తదుపరి తరం తయారీ పరిశోధకులను మరియు ఇంజనీర్లను అభివృద్ధి చేయడం తమ దార్శనికత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి లింకన్ ఎలక్ట్రిక్ ఇండియా నుండి హెడ్ ఆఫ్ హెచ్ ఆర్ వేణు భారతి, హెడ్ ఆఫ్ ఎక్విప్ మెంట్ అండ్ సేల్స్ నిపిన్ శంకర్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్ అండ్ డి డా. నియంత్ శ్రీధరన్ తో సహా సీనియర్ నాయకత్వం హాజరయ్యారు. టాటా స్టీల్, విప్రో, ఎల్ అండ్ టి తదితర సంస్థల నుండి సీనియర్ నాయకత్వం హాజరైంది. ఐఐటీ తిరుపతి నుండి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. డి.వి. కిరణ్, డీన్లు, విభాగాధిపతులు మరియు అధ్యాపక సిబ్బంది ఈ కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని అలంకరించారు.

## నిర్మాణ పనులను...

# త్వరితగతిన పూర్తి చేయాలి

### :తిరుపతి జిల్లా కలెక్టర్ డాఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : రైల్వే ప్రాజెక్ట్, భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీసిటీ ఫేస్ 2, ఎల్‌జి ఫేస్2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు, ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫిల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావుతో కలసి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పోర్ట్ పనులు, శ్రీ సిటీ ఫేస్ 2, ఎల్ జి ఫేస్2, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి, నెల్లూరు చెన్నై నేషనల్ హైవే పిడి లు, వెంకటేశ్వర్లు, రమేష్, రవీంద్రావు, ఎస్‌ఈ ఇరిగేషన్, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీ సిటీ ఫేజ్ 2, ఏ పి ఐ ఐ సిలోని ఎల్ జి ఫేజ్ 1,2, 3 శ్రీ సిటీ ఫేజ్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్ ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, సూళ్లూరుపేట ఆర్డీఓలు, దేవేంద్ర రెడ్డి, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ ఆధికారులు భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్ఎల్వి ఎఫ్ 17...

# కౌంట్ డౌన్ ప్రారంభం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి ప్రయోగించిన జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ కు సంబంధించి బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రారంభం కానున్నది. సుమారు 27 గంటల పాటు కౌంట్ డౌన్ కొనసాగే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో మిషన్ రేడినెస్ రివ్యూ సమావేశాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. అలాగే ల్యాబ్ సమావేశాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరంగా క్లియరెన్స్ తీసుకున్నారు. ఇవన్నీ సజావుగా కొనసాగితే శుక్రవారం వేకువజామున రెండు గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ నింగికి ఎగురనున్నది. ఈ రాకెట్ ద్వారా అత్యంత కీలకమైన అధునాతమైన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన భూ పరిశీలన ఉపగ్రహం ఈవో ఎస్ 05 నుకక్షలోకి ప్రవేశ పెట్టనున్నారు.

## ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి కొత్త ఇన్‌చార్జి వీసీ

### -సెప్టెంబరు 1 నుంచి వైకుంఠరావు బాధ్యతలు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యా లయానికి ఇన్‌చార్జి ఉపకులపతిగా డా. వైకుంఠరావు నియమితుల య్యారు. సెప్టెంబరు నుంచి ఆయన ఈ బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశ్వవిద్యాల యంలో విద్యార్థుల వ్యవహారాల విభాగం డీన్‌గా విధులు నిర్వహిస్తున్న డా. వైకుంఠ రావుకు అదనం గా ఇన్‌చార్జి ఉపకులపతి బాధ్యతలను అప్పగించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన డా. జె.వి. రమణ పదవీకాలం ఆగస్టు 31తో ముగి యడంతో ప్రభుత్వం కొత్తగా వైకుంఠరావును నియమి ంచింది. విశ్వవిద్యాలయ చట్టంలోని నిబంధనల ప్రకారం గవర్నర్, విశ్వవిద్యాలయ చాన్సలర్ ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో శాశ్వత ఉపకులపతి నియామకం జరిగే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు వైకుంఠరావు ఇన్‌చార్జి ఉపకులపతిగా కొనసాగనున్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో విద్యార్థుల వ్యవహారాలు, విద్యా సంబంధిత అంశాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు తాజాగా పరిపాలనా బాధ్యతలు కూడా అప్పగించడంతో వర్సిటీ కార్యకలాపాలపై ప్రాధాన్యత ఏర్పడింది.

## ప్రమాదాల కట్టడికి...

# సమన్వయంతో చర్యలు : కలెక్టర్



కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడానికి, ప్రాణాంతకమైన ప్రమాదాలను తగ్గించడానికి సంబంధిత శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవన ంలో మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్య ంలో జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఛైర్మన్ అయిన కలెక్టర్ సుమిత్‌కుమార్ మా ట్లాడుతూ అధిక ప్రమాదాలు జరుగుతున్న జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించాలన్నారు. ఎన్‌హెచ్-69 (బెంగ ళూరు-పలమనేరు-చిత్తూరు-చెన్నై), ఎన్‌హెచ్-140(చిత్తూరు-తిరుపతి), ఎన్‌హెచ్- 42 (కుప్పం-పలమనేరు) మార్గాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలను గుర్తించి ప్రమాదాలను కట్టడి చేయడానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారులపై లైటింగ్, భద్రతా చర్యలను పటిష్టం చేయాలన్నారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నప్పటికీ ప్రాణాం తకమైన ప్రమాదాలను మరింత తగ్గించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిం చాలన్నారు. 2025 జనవరి-ఆగస్టులతో పోల్చితే 2026లో మొత్తం ప్రమాదాలు 462 నుండి 425కు తగ్గాయని, అంటే 8 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, అలాగే గాయపడిన వారి సంఖ్య 615 నుండి 449కు తగ్గిందన్నారు. అంటే గాయపడిన వారి సంఖ్య 27 శాతంకు తగ్గుముఖం పట్టిందన్నారు. ముఖ్యంగా ఎన్‌హెచ్-69, ఎన్‌హెచ్-42, ఎన్‌హెచ్-140 మార్గాల్లో ప్రమాదాలకు కారణాలను గుర్తించి బ్లాక్ స్పాట్ల వద్ద పోలీస్ పర్యవేక్షణ, వాహన తనిఖీలు, వేగ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత పటిష్టం చేస్తామన్నారు. అలాగే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రహదారి భద్రతా లోపాలను పరిష్కరించి, గోల్డెన్ ఆవర్‌లో ప్రమాద బాధితులకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను సమావేశంలో కలెక్టర్ ప్రమాదాలకు దారి తీసిన కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించాలసూచించారు. ఒకే ప్రాంతంలో పదేపదే ప్రమాదాలు జరుగుతున్నట్లైతే ఆ ప్రాంతంను గుర్తించి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన ఇజంనీరింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అవగాహన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎఫ్‌ఓ సుబ్బరాజు, డిటిసి నిరంజన్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఎఐ పిడి జి.వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బి ఇఇ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు బి.చందు, కార్తీకరెడ్డి, రవీందర్‌రావు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ సురేష్‌బాబు, ఆర్టీసీ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ, డిసిహెచ్ డాక్టర్ పద్మాంజలి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భరోసా పెన్షన్ అందించిన ఏఎంసీ ఛైర్మన్

నాగలాపురం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:



నాగలాపురం మండలంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను మంగళవారం ఏఎంసీ ఛైర్మన్ దామోధరన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల 1వ తేదీ ఇంటి వద్దకే పింఛన్ అందిస్తోందని, ప్రతి ఇంటికి పెన్షన్ తప్పకుండా చేరాలని చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసయాదవ్, స్టేట్ మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ నమఃశివాయం, ఏఎంసీ డైరెక్టర్లు మధు, రవి, బూత్ ఇన్‌చార్జి నాగరాజు స్కూలు ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నరేంద్రరెడ్డి, యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆందోళనకు శ్రీకారం...

### సెప్టెంబర్ 5 వరకు బ్లాక్ బ్యాడ్జ్ ఉద్యమం





తిరుపతి రూరల్, సెప్టెంబర్ 1 ప్రభాత్‌వార్త : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిల సాధన కోసం ఉద్యమ బాట పట్టారు. ఏపీ జెఎసి ఏపీ ఆర్ ఎస్ ఏ అమరావతి–తిరుపతి జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు అయిన పెండింగ్ బకాయిల చెల్లింపు, పెండింగ్ డీఏలు విడుదల, పి ఆర్ సి కమిషనర్ నియామకం, అంతర కాల భత్యం ప్రకటన వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈ ఉద్యమం చేపట్టినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఒకటవ తారీకు నుండి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ప్రతి ఉద్యోగి విధులకు హాజరయ్యేటప్పుడు నల్ల బ్యాడ్జీలు ధరించాలని నిర్ణయించారు. అదేవిధంగా సిఎం సార్.. మా డబ్బులు మాకివ్వండి అనే నినాదంతో రూపొందించిన సెల్‌ఫోన్ డీపీని తప్పనిసరిగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సంఘం ఈసీ సభ్యులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ, తమ తమ విభాగాల్లోని ఉద్యోగులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వ్యక్తిగతంగా కూడా ఈ కార్యాచరణను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐకమత్యంతో, క్రమశిక్షణతో ముందుకు సాగితేనే ఫలితాలు సాధ్యమవుతాయని నాయకులు స్పష్టం చేశారు. రేపటి నుండి ప్రారంభమయ్యే డీపీ–బ్లాక్ బ్యాడ్జ్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్ గోవర్ధన్ ఎమ్మార్రై రఘువర్మ తదితరులు పాల్గొన్నారు

## స్వర్ణగ్రామం, వార్డు సచివాలయాల్లో రెస్కో సేవలు

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)కు సంబంధించిన పలు పౌర సేవలను స్వర్ణగ్రామం మరియు స్వర్ణవార్డు సచివాలయాల్లో అందుబాటులో తీసుకువచ్చినట్లు రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ తెలిపారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల చెల్లింపు, నూతన విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తులు, విద్యుత్ లోడ్డు మార్పిడి, వినియోగదారుల పేరు మార్పు, కేటగిరీ మార్పు, వినియోగదారుల ఫిర్యాదులు అందుబాటులో ఉ ంటాయన్నారు. స్వర్ణగ్రామం వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఈ సేవలను ఎపిసేవ పోర్టల్ ద్వారా నిర్వహిస్తారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## పెన్షన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీ టాప్ : కమీషనర్

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రతినెలా అందించే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచిందని కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు.



మున్సిపాలిటీలో 5420 పెన్షన్లకు గాను 5110పెన్షన్లను మంగళవారం మధ్యాహ్నం కల్లా 94.28శాతం మేర పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల ద్వారా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కాగా 4405 పెన్షన్లకు గాను 4110పెన్షన్ల పంపిణీతో పలమనేరు మున్సిపాలిటీ ద్వితీయ స్థానం, 8660పెన్షన్లకు గాను 8069పెన్షన్ల పంపిణీతో శాంతిపురం మండలం తృతీయ స్థానంలో నిలిచాయి.

## రైతులు..వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

### – వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



శాంతిపురం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలో కరువు పరిస్థితుల దృష్ట్యా రైతులు, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి డిమాండ్ చేశారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్ని కరువు మండలాలుగా ప్రకటించడంతో పాటు పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలన్నారు. అలాగే రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. రైతుల రుణాల రికవరీని తాత్కాలికంగా నిలిపేసి రుణాలపై వడ్డీని ప్రభుత్వం భరించాలన్నారు. పాడి రైతులకు పశుగ్రాసం, దాణా ఉచితంగా అందించాలన్నారు. విబిజిరామ్‌జీ పథకంలో కూలీలకు 150రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

## గొర్రెల పెంపకందారుల సంఘ ఎన్నికలు ఏకగ్రీవం



రామకుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో పాంచజన్య గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఛైర్మన్‌గా గోపాల్‌గౌడు, కార్యదర్శిగా నాగరాజు, సభ్యులుగా రామకృష్ణగౌడు, నారాయణ గౌడు, వెంకటేష్ గౌడు, రామప్పగౌడు, కృష్ణప్ప గౌడును ఎన్నుకున్నారు. నూతన సంఘాన్ని నేతలు ఆనందరెడ్డి, రవిరెడ్డి, మునిరెడ్డి, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి, సుబ్రమణ్యం, గోవిందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

## పిఏసిఎస్‌లో యూరియా పంపిణీ

బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో రైతులకు యూరియా పంపిణీని పిఎసిఎస్ ఛైర్మన్ నాగరాజ నాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకెవైసి చేసి పంట నమోదు చేసుకున్న రైతులు యూరియా పొందవచ్చన్నారు. పంట నమోదు చేయని రైతులు అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు విశ్వనాథ్, దివాకర్, నేతలు మంజునాథ్, అధికారులు జ్యోతిరామ్, మోహన్, భాస్కర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

## సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. లంకమిట్ట ప్రాంతంలోని కుందేటివారి వీధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పండ్లను పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 50 నోట్ పుస్తకాలు, 50 పలకలు, పండ్లను అందజేశారు. అనంతరం విద్యార్థులకు చిన్న చిన్న నీతి కథలు చెబుతూ, వాటి ద్వారా మంచి అలవాట్లు, క్రమశిక్షణ, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎల్. పాండురంగయ్య, జి. దామోదరం, ఎం. జయంతి, పాఠశాల ప్రధానోపాధ్యా యులు మేరీ ప్రవీణ, ఉపాధ్యాయులు జే. రమేష్, సుధీర్, పవన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజిక్స్ బోధనకు అతిథి అధ్యాపకులు కావలెను

పుత్తూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భౌతిక శాస్త్రం (ఫిజిక్స్) బోధించడానికి అతిథి అధ్యాపకులు కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎపి సెట్, యుజిసి నెట్, పిహెచ్‌డి కలిగిన వారికి ప్రాధాన్యత వుంటుందన్నారు. ఆసక్తి వున్న అభ్యర్థులు ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు సంబంధిత ధృవపత్రాలతో కళాశాలకు నేరుగా హాజరవ్వాలని తెలిపారు. ఇతర వివరాలకు 9949027179, 7396650368 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## చిన్న జంబాడలో నిరంతర విద్యుత్ సరఫరా : డిఇఇ

విజయపురం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జంబాడ పంచాయతీ చిన్నజంబాడ గ్రామంలో రెండు నెలలుగా విద్యుత్ సరఫరా జరగడం లేదన్న ఆరోపణల్లో వాస్తవం లేదని విద్యుత్ శాఖ నగరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గాలి వాన వల్ల గ్రామానికి చెందిన విద్యుత్ లైను దెబ్బతిందని, మరుసటి రోజు ఈ ఏడాది జూన్ 22వ తేదీన తాత్కాలికంగా ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేసి వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. అలాగే జూన్ 23వ తేదీన శాశ్వత ప్రాతిపదిక గాలి వానకు పడిపోయిన విద్యుత్ పోల్‌ను సిద్ధం చేయడానికి తాము సంఘటనా స్థలానికి వెళ్లగా స్థానికంగా నివశిస్తున్న వారు తమ ఇంటి దగ్గర విద్యుత్ పోల్ వేయడానికి వీలులేదని అభ్యంతరం చెప్పారని వివరించారు. అయినప్పటికీ అప్పటి నుంచి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోందని తెలిపారు. అభ్యంతరం తెలిపిన వారిని ఒప్పించి గత నెల 31 తేదీన శాశ్వత పోల్ వేశామని తెలిపారు

## కళ్యాణ వెంకన్నకు...

### ప్రవాస భారతీయ దంపతులు కానుకలు

చంద్రగిరి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసి యున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి ప్రవాస దంపతులు మంగళవారం ఆలయ పోటువర్కర్ జి.టి.వంశీ మోహన్ స్వామి ఆధ్వర్యంలో కానుకలు సమర్పించుకున్నారు. మండల పరిధిలోని బుచ్చినాయుడుపల్లి (తుంగరాంపల్లి) కి చెందిన దామరపాటి చంద్రమౌళి, దామరపాటి లత వృత్తిరీత్యా అమెరికాలో వుంటున్నారు. ఆలయ పోటులో ప్రసాదాలను తయారు చేసే వంశీమోహన్ స్వామి సూచనలతో దంపతులు స్వామివారికి ప్రసాదాల నివేధనకు వినియోగించే పలు ఇత్తడి పాత్రలను కానుకలుగా అందజేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.2.20 లక్షల విలువైన 26 ఇత్తడి పాత్రలను కుటుంబ సభ్యులు, వంశీమోహన్ స్వామితో కలసి ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్‌కు అందజేశారు. ఆలయ అధికారులు దంపతులకు స్వామివారి దర్శన ఏర్పాట్లు గావించి, ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు. తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం స్వామివారికి కానుకలు అందజేసినట్లు దంపతులు వెల్లడించారు.

## 4న గోకులాష్టమి ఆస్థానం

తిరుమల, సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:



ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడుగా ఆనాడు తన జన్మదినాన్ని గోపికలు,ద్వారకవాసుల మధ్య వేడుకగా జరుపుకున్నట్లు, కలియుగవైకుంఠం తిరుమలలో వేంకటేశ్వరస్వామి చెంత గోకులాష్టమి ఆస్థానం అత్యంత కన్నులపండువగాజరగనుంది. 4వతేదీ శుక్రవారం శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. గోగర్భమ్‌డ్యామ్ సమీపంలోని ఉద్యానవనంలో కాళీయమర్ధనుడికి విశేష అభిషేకాలు జరిపిస్తారు. అదేరోజు రాత్రి వెంకన్న ఆలయంలోని బంగారువాకిలిలో ముఖమండపంలో రాత్రి 8గంటల నుండి 10గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆరోజు బంగారుసర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపుచేసి నివేదనలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి,శ్రీదేవిభూదేవి అమ్మవార్లకు శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేస్తారు.

## నాగలాపురంలో ఎమ్మెల్యే పర్యటన

### –పెన్షన్ పంపిణీ, రైతులకు విత్తనాలు పంపిణీ

నాగలాపురం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం నాగలాపురం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో 220 మందికి రాజముద్ర కలిగిన పాసు పుస్తకాన్ని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా పలు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు వివిధ సామగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు నాగలాపురం మండలంలోని ఆంజనేయస్వామి వీధిలో నిర్వహించిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులకు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పింఛన్ దారులను పరామర్శించి, ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పథకాల ద్వారా పేద, వృద్ధ, వితంతు, దివ్యాంగ కుటుంబాలకు భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు నాగలాపురం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం(ఎంపీడీవో కార్యాలయంలో) వెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, రైతులకు కూరగాయల విత్తనాలు, స్ప్రేయర్లు, పట్టలు, వెదురు మొక్కలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు తిరుపతి పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు యాచేంద్రనాయుడు, ఎంపీటీసీ సెల్వ కుమార్, భాస్కర్‌శెట్టి, ప్రసాద్, జి.మురళి, ఎస్.ఎం.సురేష్, పళణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరులో ఘనంగా ఆరేటమ్మ ఆలయ జాతర

### –కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో వెలసిన గ్రామదేవత శ్రీ ఆరేటమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అమ్మవారి మూలవర్లకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఉత్సవ విగ్రహాన్ని కూడా పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అంబలి ప్రసాదంగా అందించారు. అలాగే ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ వేపాకుల తోరణాలతో సుందరంగా అలంకరించారు. కార్వేటినగరం రోడ్డులోని మండపం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలు డప్పు వాయిద్యాలు నడుమ బాణసంచా పేలుస్తూ సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమం పట్టణంలోని పలు వీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయానికి చేరుకుంది. భక్తులు అడుగడుగునా అమ్మవారికి, మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు ప్రసాదాలు అందించారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్** పుత్తూరు పట్టణంలో గ్రామదేవత ఆరేటమ్మ ఆలయం ఉత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాలాభిషేకం కార్యక్రమానికి హాజరై అమ్మవారికి పాలాభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు, కూటమి పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ఏఎంసీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బి.ఆర్.యుగంధర్, మాజీ ఎంపీపీ ఏళుమలై, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.మాధవనాయుడు, తడుకు సింగిల్‌విండో ఛైర్మన్ కరుణ, పుర ప్రముఖులు విక్కీరాయల్, వి.ఎం.గోపి, రమేష్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, ఈశ్వర్ యాదవ్, కె.వెంకటేష్, ప్రసాద్‌వర్మ,ఆలయ మాజీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, పూజారి ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

## వాడ వాడల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు అందజేత





శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1 ప్రబాతవార్త: శ్రీకాళహస్తి పురపాలకసంఘంలోని వాడ వాడల్లో మంగళవారం సూర్యోదయానికి ముందే ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ దారుల చేతుల్లో పచ్చని రూ,500నోట్లు దర్శనమిచ్చాయి.కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాన్ని ప్రజలకు చేరవేస్తూ గడచిన రెండు సంవత్సరాల్లో చేపట్టిన పథకాలు,పనుల గురించి ద్వితీయ శ్రేణి నాయకులు ప్రజలకు వివరిస్తున్నారు. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పరిపాలనలో చేపట్టిన ప్రగతిని గురించి వివరిస్తున్నారు.ఈ నేపథ్యంలో 32వ వార్డులో పెన్షన్ల పంపిణిని పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు సారధ్యంలో అందజేసారు.ఈ కార్యక్రమాల్లో క్లస్టర్ ఇన్‌చార్జి కంఠా రమేష్, వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులురెడ్డి, బూత్ ఇన్‌చార్జి షాహాబుద్దీన్, యశ్వంత్,ఎస్‌కె జిలాని,లోకేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.కాగా 22 వ వార్డు ఎన్‌టిఆర్ నగర్‌లో యూనిట్ ఇన్‌చార్జి నెమళ్ళూరు బుజ్జి సారధ్యంలో పెన్షన్లను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగు నింపిన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు అని ప్రజలకు వివరించారు.అలాగే వార్డులో పార్టీ కోసం పని చేసి డయాల్సిస్ సమస్యతో సతమతమౌతున్న బాధితుడు కాల్వ ప్రసాద్‌కు రూ.10వేలు పెన్షన్‌ను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కృషితో మంజూరు అయినట్లు అందజేసారు.ఈ కార్యక్రమాల్లో బుజ్జితో పాటు బూత్ ఇన్‌చార్జిలు శివకుమార్,బాలయ్య, సచివాలయ సిబ్బంది మునికృష్ణ, సునీల్, మౌనిక,ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

## వాయులింగేశ్వరుని దర్శించుకున్న గవర్నర్

శ్రీకాళహస్తి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులిం గేశ్వరుని సేవలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుటుంబసభ్యులతో కలసి పాల్గొన్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటో కాల్ ఎఇఓ లోకకేష్‌బాబు,ఆలయ పిఆర్‌ఓ రవి, శ్రీకాళహస్తి తహశీల్దార్ టివి సుబ్రమణ్యంలు స్వాగతం పలికారు. స్వామి అమనమవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఇఓ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి ప్రత్యేకాహ్వానితులు వెంకటరమణలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

## 3న పాల సొసైటీ మహాజన సభ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్న ది కాళహస్తి కో ఆపరేటివ్ పాలసరఫరా సంఘ మహాజన సభ ఈ నెల 3న ఏర్పాటు చేసినట్లు చైర్మెన్ మునగాల మధుసూధనరావు(చిట్టి) మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతు ప్రతి ఏటా ఖాతాదారులకు అందించే ప్రోత్సహాకాలను అందించుటకు నిర్ణయించినట్లు ఆయన వివరించారు.ఈ సారి సమావేశాన్ని పట్టణ పొలిమేరల్లోని శివాని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరౌతారని తెలిపారు, పాడిరైతులు,బోర్డు సభ్యులు హాజరు కావాలని చైర్మెన్ కోరారు.

## గుండెలగుంటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

తొట్టంబేడు సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలం గుండెలిగుంట పంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళ వారం తెలుగుతమ్ముళ్ళు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మునిరాజ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ రమేష్ బాబు, బూత్ ఇంచార్జ్ లు బయ్యారెడ్డి, గున్నయ్య, మంగా ఒడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ దుస్థితి...కూలిపోయే స్థితిలో భవనం

తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆధార్ కార్డ్ సేవలు అందిస్తున్న కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో తెలియని దయనీయ స్థితిలో దర్శనమిస్తోంది. పైకప్పు పెచ్చులూడిపోయి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. గోడలన్నీ బీటలు వారి వర్షపు నీటితో తడిసి తేమ పట్టి ఉన్నాయి. ఈ భవనంలోనే రోజూ వందలాది మంది చిన్నా పెద్దా, ముసలి ముతక అందరూ ఆధార్ కార్డులు, ఆధార్ కరెక్షన్ల కోసం వస్తున్నారు.ఈ విషయంపై ఆధార్ సెంటర్ నిర్వాహకుడు శశికుమార్ మాట్లాడుతూ, తొట్టంబేడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఆధార్ సేవలు ఇక్కడే అందిస్తున్నామని, రోజూ వందల మంది ప్రజలు ఇక్కడకు వస్తున్నారని తెలిపారు. అయితే ఇక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో కూర్చోవడానికి సరైన కుర్చీలు లేవని, ఫ్యాన్లు లేవని, తాగునీటి వసతి కూడా లేదని తెలిపారు. పైకప్పు పెచ్చులు ఎప్పుడు ఊడి మీద పడతాయోనని భయం భయంగానే విధులు నిర్వహిస్తున్నామని, ప్రజలు కూడా భయంతోనే వచ్చి వెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఆధార్ సెంటర్లను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో కనీస వసతులు కల్పించడంలో విఫలమైందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆధార్ ఇప్పుడు ప్రతి పథకానికి, ప్రతి అవసరానికి తప్పనిసరి అయిన నేపథ్యంలో ఇలాంటి శిథిల భవనంలో సేవలు అందించడం దారుణమని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయంలోని ఆధార్ సెంటర్ కు కొత్త భవనం కేటాయించాలని, లేదా వెంటనే మరమ్మతులు చేయించి కనీసం కూర్చోడానికి కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీరు వంటి కనీస వసతులైనా కల్పించాలని నిర్వాహకుడు శశికుమార్ మరియు ప్రజలు కోరుతున్నారు.

## బైండోవర్ అనేది ముందుజాగ్రత్త చర్యలు :ఎస్ఐ

తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకునే 'బైండోవర్'ను వైకాపా నేతలు వక్రీకరించి ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆ పదానికి అర్థం తెలియకుండా మట్లాడటం శోచనీయం అని మంగళవారం తొట్టంబేడు ఎస్ఐ బాలకృష్ణ ఓ ప్రకటనలో ఖండించారు. పోలీసు వ్యవస్థపై వైఎస్ఆర్సీపీ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధానజిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు నిరాధార ఆరోపణలు చేస్తూ వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం బాధ్యతా రాహిత్యమని ఆయన ఖండించారు. అదేవిధంగా లింగంనాయుడు పల్లి పంచాయతీ కురవకొండ గ్రామంలో శ్రీరామ మందిర కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా యువకులు మైక్ సిస్టం పెట్టి భజన కార్యక్రమాలు చేసుకోవడం వరకు పోలీసులకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ అక్కడ 28, 29 ఆగస్టు 2026 తేదీల్లో రాత్రి డీజే సౌండ్ సిస్టం పెట్టి హోమం జరిగిన ప్రదేశంలో అనుమతులు లేని, ఇవ్వడానికి అవకాశం లేని రికార్డింగ్ డ్యాన్స్, బయట నుంచి మహిళలను పిలిపించి డ్యాన్సులు వేయించడం జరిగినట్లుగా అదే గ్రామంలో ఇబ్బందిగా ఫీలైన వ్యక్తులలో ఒకరు డయల్ 112 నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తమకు సమాచారం అందిందని తెలిపారు. వ్యవస్థను గౌరవించి చట్ట ప్రకారం తీసుకునే చర్యల్లో పోలీసు వ్యవస్థకు సహకరించాల్సింది పోయి దానిని వక్రీకరిస్తూ పోలీసు వ్యవస్థ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బైండోవర్లు చేయించడం ద్వారా హడావిడి చేస్తున్నట్లు, తమ పార్టీకి చెందిన కార్యకర్తలను, సానుభూతిపరులను భయపెడుతున్నట్లు నిరాధారంగా సమాచారం వ్యాపింప చేయడం, అది కూడా ఎంతో రాజకీయ అనుభవం కలిగిన రాజకీయ కురువృద్ధుడి ద్వారా ఈ విధంగా చేయడం ఏమాత్రం తగదని ఎస్ఐ పేర్కొన్నారు.

## హత్య కేసులో నిందితులు కోర్టుకు హాజరు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసు కు సంబంధించి నిందితులైన గూడూరు ధన శేఖర్, షేక్ అయ్యూబ్‌లను మంగళవారం స్థానిక కోర్టుకు హాజరపరిచారు. నిందితులనపోలీసులు పట్టణములోని బజారు విధుల్లో నడిపించుకుంటూ వెళ్లి కోర్టులో మేజిస్ట్రేట్ ముందరహాజరు పరిచారు. సిఐ ఎం మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నిందితులు ప్రస్తుతం జరిగిన పరిణామంతో తిరిగి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో జైలు నుండి బయటకు తిరిగివచ్చి సమాజంలో మంచిగా నడుచుకుంటారన్న భావంతోనే నిందితులను బజారులో నడిపించుకుని తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. నేరం చేస్తే శిక్షతో పాటు సిగ్గుతో తలదించుకునేలా చేయడం జరుగుతుందని నేరస్తులు గుర్తుపెట్టుకునే విధంగా ఈ చర్యలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సీఐతో పాటు ఎస్ఐ అజయ్ కుమార్ ఉన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు విధులకు హాజరు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ కోర్కెల సాధన కోసం మంగళవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఉద్యోగుల ఆత్మగౌరవం కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడేందుకు ముందుకు రావాలని ఉద్యోగులు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు లంచ్ అవర్‌లో నిరసన తెలుపుతామని తెలిపారు. సెప్టెంబర్ 11న అన్ని జిల్లా కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు కార్మిక ఉద్యోగ సంఘ నాయకులతో తదుపరి ఉద్యమ కార్యాచరణపై చర్చ జరుగుతుందని చెప్పారు. సెప్టెంబర్ 15 నుంచి 25 వరకు ఎమ్మెల్యేలు ,ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 26వ తేదీ ఉద్యోగ కుటుంబ సభ్యులతో కలిసి మా డబ్బులు మాకు ఇవ్వండి సీఎం సార్ అంటూ నినదాలు ధర్నాలు చేయడం జరుగుతుందని వివరించారు.

## పెన్షన్ల పంపిణీలో దేశానికే రాష్ట్రం ఆదర్శం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం ఇంటి వద్దకు తీసుకువచ్చి ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వం దేనిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మాసా పేటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. 4000, 6000, 15 వేల రూపాయలు పెన్షన్లను అధిక మొత్తంలో ఇస్తున్న ఘనత కూడా సీఎం నారా చంద్రబాబు నాయుడుకి దక్కిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం ఇంటి వద్దకే పెన్షన్లను తీసుకొచ్చి ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల యోగక్షేమాలు కూడా అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో సక్రమంగా పెన్షన్లను ఇవ్వలేదని విమర్శించారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, పద్మశాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, పోలేరమ్మ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తాండవ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు : ఎమ్మెల్యే రామకృష్ణ

బాలాయపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: పాల కేంద్రం నుండి సాయిబాబా గుడి వరకు డబల్ రోడ్డు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పాల కేంద్రం వద్ద నిర్మిస్తున్న పోలేరమ్మ ఆర్చ్ వద్ద ప్రస్తుతానికి ఎలాంటి ఆఖరులను తొలగించమని తెలిపారు. డబల్ రోడ్డు వచ్చినప్పుడు అయితే తొలగిస్తామని తెలిపారు. పోలేరమ్మ ఆర్చి వద్ద తమ నిర్మాణాలను తొలగిస్తున్నారని ఎమ్మెల్యేకి చెప్పడంతో ఆయన స్వయంగా వచ్చి పరిశీలించారు. దుకాణదారులను ఎవర్ని ఇబ్బంది పెట్టే ఆలోచన లేదని తెలిపారు. మరో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందర నందనంగా తీర్చిదిద్దామని తెలిపారు. విరియుగా అభివృద్ధి చెందులు ఏర్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# సూళ్ళూరుపేట డివిజన్

## బూత్ నంబర్ 227 పరిధిలో ఇంటింటి ప్రచార కార్యక్రమం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: బూత్ నంబర్ 227 పరిధిలో ఇంటింటి ప్రచార కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 10,800 ఇళ్లను పూర్తి చేసుకుని, మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, బూత్ ఇన్‌చార్జ్‌లకు, నాయకులకు మరియు కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రతి ఇంటికీ చేరువవుతూ, ప్రజలతో మమేకమవుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ మహీధర్ నాయుడు కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాయకులకు మేడ సాయి, శ్రీధర్, మునిరాజా, గోపి, మాజీ కౌన్సిలర్ బాబు, తేజ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా చెన్నకేశవ స్వామి వార్షికోత్సవం



పెళ్లకూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: పెళ్లకూరు గ్రామంలో స్థానికంగా వెలసియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయం యొక్క 13వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను మంగళవారం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఆలయ ధర్మకర్తలైన రాయసం. హృషికేశవరావు, శ్రీ లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యవచనం, కలశ పూజతో ప్రారంభమై మధ్యాహ్నం స్వామి అమ్మవార్ల కళ్యాణం సాయంకాలం గ్రామం ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ బ్రహ్మోత్సవాలను గ్రామంలోని ప్రజలందరూ ఎంతో ఆనంద ఉత్సవాల మధ్య భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

## క్వారీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### -మాజీ మంత్రి రోజా డిమాండ్

పుత్తూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : పట్టణంలోని 21వ వార్డు చెర్లోపల్లిలో అనుమతి లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న గ్రానైట్ క్వారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పేలుళ్ల వల్ల స్థానిక గ్రామ ప్రజలు ముఖ్యంగా రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం అక్రమ పేలుళ్ల వల్ల పెద్ద పెద్ద రాళ్లు ఎగిరి వచ్చి పొలం దున్నుతున్న స్థానిక గ్రామస్తుడు ఈశ్వరయాదవ్ పక్కనే పడ్డాయి. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ నేపథ్యంలో రోజా మంగళవారం చెర్లోపల్లిలోని గ్రానైట్ క్వారీలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పుడుపడితే అప్పుడు బ్లాస్టింగ్‌లు జరుగుతుండడం వల్ల పెద్ద పెద్ద రాళ్లు ఎగిరి వచ్చి స్థానిక పొలాల్లోనూ, ఇళ్లపైన పడుతున్నాయన్నారు. పర్యవసానంగా ఇళ్లు దెబ్బతినడమే కాకుండా వ్యవసాయానికి పొలానికి వెళ్లడానికి రైతులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రాణాల కంటే క్వారీ యజమానుల లాభాలే ముఖ్యమైనట్టుగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బాధితులు తమ సమస్యను పోలీసు, రెవెన్యూ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని తెలిపారు. క్వారీల నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు వున్నాయా ?, బ్లాస్టింగ్‌కు అనుమతి వుందా లేదా అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు వుంచాలని డిమాండ్ చేశారు. క్వారీల యజమానులకు రాజకీయ అండదండలున్నాయన్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. చెర్లోపల్లి గ్రామస్తులు, రైతులకు అన్యాయం జరిగితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని, రైతుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, పార్టీ పట్టణ విభాగం అధ్యక్షుడు ఏకాంబరం, నాయకులు ఆనంగి హరి, నారాయణరెడ్డి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.



## అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో...

## పతాకాలు సాధించిన ది స్కూల్ విద్యార్థులు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: ఇటీవల తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆర్చరీ లో మొదటి, రెండవ స్థానంలో పతకాలు సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్ జనార్ధన్ రావు జె.పవార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఛాంపియన్ షిప్ పోటీలో ఆర్చరీ అండర్ 17లో కె. లోహిత రెడ్డి, మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకం, ఎస్. పార్థివ్ రెండవ స్థానంలో నిలచి సిల్వర్ పతకం సాధించినట్లు తెలిపారు. ఈ పతకాలతో పాటుగా, పదివేల రూపాయల నగదు బహుమతి వచ్చిందని తెలిపారు. విద్యతో పాటుగా, క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభను చాటాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనార్దన్ రావ్‌జె.పవార్, ప్రధాన ఉపాధ్యాయురాలు పి. విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## టీటీడీ డిగ్రీ కళాశాలలకు కొత్త సారథులు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: టీటీడీ ఆధ్వర్యంలోని డిగ్రీ కళాశాలలకు కొత్త సారథులు నియమితులయ్యారు. ముగ్గురు అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లగా బాధ్యతలు అప్పగిస్తూ టీటీడీ విద్యాశాఖ అధికారి డి. ఫణికుమార్ నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చరిత్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ జి. కిషన్‌ను నియమించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎన్. వేణుగోపాలరెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కిషన్‌కు బాధ్యతలు అప్పగించారు. పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ సి. భువనేశ్వరీదేవిని నియమించారు. ఇప్పటి వరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కామర్స్ అధ్యాపకురాలు డాక్టర్ నారాయణమ్మను గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసి బాధ్యతలు అప్పగించారు.

### దస్తావేజులు దారపోయినవి

10-8-2026వ తేదీన నా పేరున శ్రీకాళహస్తి ఓంకార్ నగర్, ప్లాట్ నెం.12, స్థలము, దస్తా వేజు నెం. 1651/2003 తేది 28-8-2003, పెండ్లిమండపం దగ్గర జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళుచుండగా దారిపోయినవి. ఎవ్వరికైనా దొరికనచో ఎస్.ఎ.ఒ. 1వ టౌన్ పోలీస్ స్టేషన్, శ్రీకాళహస్తి వారికిగాని, ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించగలరు. చెలికం సునంద, శ్రీరామ్‌నగర్ కాలనీ, శ్రీకాళహస్తి, సెల్ : 9491285947.

## రోడ్డు ప్రమాదంలో...

## రెండు జింకలు మృతి

పుల్లంపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం గ్రామానికి వెళ్ళు దారిలో మంగళవారం ఉదయం రెండు జింకలు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రెండు జింకలు అక్కడికక్కడే మృతి చెందాయి విషయం తెలుసుకున్న రాజంపేట రేంజ్ అనంతసముద్రం బీట్ అధికారి లింగారెడ్డి, బేస్ క్యాంప్ మెంబర్స్ తో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు, అనంతరం రెండు జింకలకు పుల్లంపేట పశువైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి పై అధికారుల ఆదేశాల మేరకు రెండు జింకలను అక్కడికక్కడే ఖననం చేశారు.




### ప్రభుత్వ (ఎస్‌డబ్ల్యు) బాలికల సాంఘీక సంక్షేమ వసతి గృహంలో

### వంట మనిషి ఉద్యోగం అవకాశం

శాంతిపురం (మండలం) రాళ్లబూదుగూరులో గల సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహం నందు వంట పని చేయుటకు వంటమనిషి (పార్ట్‌టైమ్) కావలయును. అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానించబడును.

పోస్టు వివరాలు

**పోస్టు పేరు : వంటమనిషి (మహిళ) ఖాళీ సంఖ్య : 01**

దరఖాస్తు గడువు : ఈ ప్రకటన వెలువడిన తేదినుంచి 7 రోజుల్లోగా దరఖాస్తులు పంపవలెను.

సహాయ సాంఘీక సంక్షేమ అధికారి
O/o సహాయ సాంఘీక సంక్షేమం వారి కార్యాలయం
కడా వారి కార్యాలయం మొదటి అంతస్తు భవనం, కుప్పం - 517425




## స్విమ్స్ సంచాలకులకు ప్రముఖుల సన్మానం



తిరుపతి హెల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం నందు పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సిమ్స్ సంచాల కులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన వారిలో డా. యలవర్తి కార్తిక్ చౌదరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, విజయవాడ, డా. మారుతీకృష్ణ, ఎండి, మారుతీ హాస్పిటల్స్, తిరుపతి, డా. కోడూరు బాలసుబ్రమణ్యం, ఛైర్మన్ ఎలైట్ హాస్పిటల్స్, తిరుపతి కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు సమర్పించి శాలువలతో సత్కరించారు. స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. గుడారు జగదీష్ పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి టీటీడీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వీరు ఆకాంక్షించారు.

## శ్రీబ్రహ్మర్షి ఆశ్రమంలో తెలంగాణ గవర్నర్



రామచంద్రాపురం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: సి.రామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మర్షి గురువానంద గురూజీ ఆశ్రమాన్ని మంగళవారం తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సందర్శించారు. ఆశ్రమానికి చేరుకున్న గవర్నర్‌కు నిర్వహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ ప్రాంగణంలో వెలసియున్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని, జైన మందిరాన్ని సందర్శించారు. శ్రీలక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గురూజీ ఆశీర్వాదం పొందారు. ఆశ్రమ నిర్వహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉద్యోగుల చిన్నారుల సంరక్షణకు ప్రాధాన్యం

### -క్రెచ్ ప్రారంభంలో సిఎండి శివశంకర్



తిరుపతి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: ఎస్పిడిసిఎల్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన చిన్నపిల్లల సంరక్షణా కేంద్రం(క్రెచ్) ను ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను మరింత ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం సంస్థ బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలున్న ఉద్యోగులకు క్రెచ్ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగులకు తమ విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగుల కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ క్రెచ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రెచ్‌లో చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు సిఎండి తెలిపారు. ఉద్యోగులు తమ విధులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా ఈ సదుపాయం దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జే. రమణాదేవి, ఆర్. పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, జాయింట్ సెక్రటరీ ఎం. గోపాలకృష్ణ, పిఆర్ఓ తోట మధుసూదన పాల్గొన్నారు.

## ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి



తిరుపతి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అభిమానులు తిరుపతిలో ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలతో నివాళులర్పించారు. మంగళవారం ఉదయం రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘంటసాల విగ్రహాన్ని శుభ్రం చేసి పాలాభిషేకం చేశారు. ఘంటసాల అభిమాని డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభంని సత్కరించారు. పలువురు ఘంటసాల అభిమానులు మాట్లాడుతూ ఘంటసాల గాత్రం అజరామజరమని తెలుగు భాష ఉన్నంతకాలం ఆయన పాటలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతో ప్రతినెల ఆయనను స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు గుండాల గోపినాథ్‌రెడ్డి, డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం, వెంకటేష్, కొట్టే సుబ్రమణ్యం రెడ్డి, టీచర్ తిరుమలయ్య, కె.ఎన్ రాజా, పురోహితుడు సురేష్ స్వామి, పోలే జనార్దన్ రెడ్డ, ఏ వన్ మస్తాన్, తులసి రామ్ నాయుడు, లోక ప్రభాకర్ నాయుడు, గాయకుడు పద్మనాభం, ఆర్ఎంఎస్ భాస్కర్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎల్ కృష్ణయ్య, మధు, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక కేంద్రంగా తలకోన అభివృద్ధి

### - శివరాత్రిలోపు ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి- ఎమ్మెల్యే పులివర్తి నాని



యర్రావారిపాలెం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: తలకోన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రం గానే కాకుండా ప్రముఖ పర్యాటక ప్రాంతంగా కూడా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పుంగనూరు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మంగళవారం తలకోనలోని శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, ఆలయ ధర్మకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులు ఆలయ అభివృద్ధికి సంబంధించిన నమూనా చిత్రాన్ని ఎమ్మెల్యేకు చూపించి, ఇప్పటి వరకు పూర్తయిన నిర్మాణ పనులు, చేపట్టాల్సిన పనుల వివరాలను వివరించారు. అనంతరం ఆలయంలోని గర్భగుడి, కోనేరు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని గుత్తేదారుకు సూచించారు. నిర్ణీత ప్రమాణాల మేరకు అత్యుత్తమ నాణ్యతతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే శివరాత్రి నాటికి పనులన్నీ పూర్తయ్యేలా అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తలకోనకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, పర్యాటకులను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని అధికారులకు, ఆలయ ధర్మకర్తల సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. భక్తుల సౌకర్యం, ఆలయ పవిత్రతకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

## శివయ్య సేవలో ఆర్‌పి గ్రూప్ వ్యవస్థాపకులు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: భారతీయ పారిశ్రామిక వేత్త, ఆర్‌పి గ్రూప్ వ్యవస్థాపకులు ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న డాక్టర్ బి.రవిపిళ్ళై మంగళవారం వాయులింగేశ్వరుని సేవలో పాల్గొన్నారు. ఆయనక బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఆయనకు స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్దకు రాగా ఆయనకు వేదపండితులతో స్వాగతం పలికారు. వారికి కోలా ఆనంద్ ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించారు. ఇక్కడ నిర్వహిస్తున్న సేవలు, అలాగే భక్తుల సౌకర్యార్థం కల్పిస్తున్న పథకాలు, కాటేజీ పథకం, అన్నదానం గురించి వివరించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల పటాన్ని ఆలయ ఎఇఓ లోకేష్ కోలా ఆనంద్ అందించారు. ఏర్పాట్లును ఆలయ సిబ్బంది నాగయ్య, దామోదరం, ఎపిఆర్ఓ రవి లు పర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## తిరుపతి జిల్లాకు 599 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు



తిరుపతి విద్య,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు 599 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో అర్హులైన అభ్యర్థులను మంగళవారం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.మొత్తం 599 పోస్టుల్లో 502 ఎస్‌జీటీ, 97 ఎస్‌ఏ పోస్టులు ఉన్నాయని, వీటికి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను సెప్టెంబరు 1, 2026 నుంచి ఏప్రిల్ 30, 2027 వరకు ఎనిమిది నెలల పాటు తాత్కాలిక ప్రాతిపదికన నియమించినట్లు చెప్పారు.మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను ప్రతిరోజూ తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన పురోగతిని పరిశీలించాలని కేవీఎన్ కుమార్ సూచించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానాన్ని సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం ఆశించిన స్థాయిలో లేనట్లు గుర్తించిన పాఠశాలల్లో తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు.

## ఇచ్చిన డబ్బులు అడిగితే తప్పుడు ప్రచారం చేస్తారా?

– బాధితురాలు ఏ.మాధవి



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: చంద్రగిరి మండలం, దోర్నాకంబాల పంచాయతీ మల్లయ్య పల్లికి చెందిన వి సురేష్ తన దగ్గర డబ్బు తీసుకొని, తిరిగి ఇవ్వాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన సరైన సమాధానం చెప్పకపోగా తనను ఇబ్బందులకు గురి చేశాడని ఏ మాధవి ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ విషయమై అతనికి లీగల్ నోటీసులు పంపించానని,పోలీసుల ద్వారా ఒత్తిడి తెచ్చాడని, కొంతమంది వ్యక్తులను పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎస్పీకి, మానవ హక్కుల అధికారులకు చట్టపరంగా ఫిర్యాదులు చేశానని పేర్కొన్నారు. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే సురేష్ అనే వ్యక్తి తనని నకిలీ డాక్టర్‌గా పేర్కొంటూ వాట్సాప్, మీడియా, వివిధ గ్రూపుల్లో ప్రచారం చేశాడని, దానివల్ల తన ప్రతిష్టకు తీవ్రనష్టం కలిగిందని వాపోయారు. అంతేకాకుండా డియం హెచ్ ఓ అధికారుల ద్వారా క్లినిక్‌కి అధికారులను పంపించడంతో, తను అందుబాటులో లేకపోవడంతో విద్యా హరహత, వైద్య ధ్రువ పత్రాలు, రిజిస్ట్రేషన్ కాఫీలు చూపించలేకపోయానని, సోమవారం నకిలీ డాక్టర్ అంటూ ప్రచారం చేయడం ఏమిటి అని ప్రశ్నించారు.తన పై వచ్చిన ఆరోపణలు నిజమా! కాదా? అనేది సంబంధిత అధికారులు, చట్టపరమైన సంస్థలు, విచారణ చేసి నిర్ణయిస్తాయని, విచారణ పూర్తి కాకనే ఒక వ్యక్తిని నకిలీ డాక్టర్‌గా ప్రచారం చేయడం, మీడియా, సోషల్ మీడియా ద్వారా పరువు తీసే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను బయటకు తీసుకురావాలని, తనకు రావలసిన డబ్బులు తిరిగి ఇప్పించాలని, తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం, వేధింపులకు సంబంధించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

## అభివృద్ధి సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వం

**పెళ్లకూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**

రెండేళ్ల అభివృద్ధి ఇంటింటికి కార్యక్రమాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం శిరసనం బేడు గ్రామంలో చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ రానున్న సమస్త గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా సామాజికపింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దర్శినికత కల నాయకుడు చంద్రబాబు నాయుడు అధ్యక్షుత న కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో వేగంగా దూసుకుపోతుందని అన్నారు.

**– కార్యకర్తలకు దిశా నిర్దేశం**

కార్యకర్తలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైనా కొన్నిచోట్ల వైసీపీ నాయకుల హావ కొనసాగడంపై కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధి విషయంలో ఎలాంటి సమస్యలున్న వెంటనే తన వద్దకు తీసుకురావాలని మన ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలను ప్రోత్సహించదని అలాగే తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలతో మమేకమై అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని దిశ నిర్దేశం చేశారు.

## రాహుల్ గాంధీ పై కేసు వెంటనే ఉపసంహరించుకోవాలి



– కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

***తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త*** పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. బిజెపి పాలనలో ప్రతిపక్ష నాయకుల పై దాడులు, కేసులు అధికమైందన్నారు. తప్పుడు కేసులు నమోదు చేసి, వేధించడం మంచిది కాదన్నారు. రాహుల్ గాంధీ పై అక్రమ కేసు పెట్టడం ప్రజాస్వామ్యానికి అవమానకరమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి పాలన కొనసాగుతోందని చింతామోహన్ పేర్కొన్నారు. గత 12 ఏళ్ల బిజెపి పరిపాలనలో దళితులకు అవమానాలు జరుగుతున్నాయన్నారు. దాడులు పెరిగిందన్నారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పర్యటించిన ప్రాంతాన్ని శుద్ధి చేసి, బిజెపి వివక్షకు పాల్పడిందన్నారు. ఇదే అంశాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించారన్నారు. వాజ్ పేయ్, అద్వానీ ఉన్న బిజెపి వేరు, మోడీ, అమిత్ షాలు కాలంలో ఉన్న బిజెపికి కోటి రెట్లు తేడా ఉందన్నారు. అద్వానీ, వాజ్పేయి కాలంలో రాజకీయాలు హుందాగా ఉండేదన్నారు. ప్రస్తుత బిజెపి కక్షపూరిత విధానాలకు పాల్పడుతోందన్నారు. డీలిమిటేషన్ జరిగితే భారతదేశం 6 ముక్కలు కావడం ఖాయమని తెలిపారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటు పరం చేస్తే బిజెపి ప్రభుత్వ పతనం ఖాయమని పేర్కొన్నారు. గరుడ పక్షి ఆకారంలో, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కాంగ్రెస్ పార్టీ, యూపీఏ ప్రభుత్వంలో తాను తీసుకొచ్చానని వెల్లడించారు.ప్రభుత్వ ఆధ్వర్యంలోనే తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం కొనసాగాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా, మొండిగా ముందుకు వెళ్లి తిరుపతి విమానాశ్రయం ప్రైవేటుపురం చేస్తే, బిజెపి, కూటమి ప్రభుత్వాలు నష్టపోతుందన్నారు. వెలుగొండ ప్రాజెక్టు గురించి గొప్పగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తిరుపతి విమానాశ్రయం గురించి ఎందుకు నోరు ఎత్తడం లేదని చింతామోహన్ ప్రశ్నించారు. టిడిపికి చెందిన ఎంపీలు అశోక్ గజపతి రాజు, రామ్మోహన్ నాయుడు ఇరువురూ కేంద్ర విమానయాన శాఖ మంత్రులుగా కొనసాగినప్పటికీ, ఒక్క అంతర్జాతీయ విమాన సర్వీసును కూడా నడపలేకపోయారని పేర్కొన్నారు. హిందూ ధర్మానికి గరుడ పక్షి ఆకారానికి లింకు ఉందని ఆయన గుర్తు చేశారు. తిరుపతి ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే బిజెపి, కూటమి ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చింతామోహన్ హెచ్చరించారు. ఈ విలేకరులు సమావేశంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు రవి, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు 15 వరకు అవకాశం

–అంబేద్కర్ వర్సిటీలో దరఖాస్తుల స్వీకరణ

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**

శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. కిషన్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ (ఆనర్స్) తదితర కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ముందుగా ఏపీఏఏఆర్ఐడీ, డీఈబీ ఐడీని సృష్టించుకోవాలని తెలిపారు. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి, అవసరమైన వివరాలతో అధ్యయన కేంద్రానికి రావాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఉద్యోగం, ఇతర కారణాలతో క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కాలేని వారు కూడా ఉన్నత విద్యను కొనసాగించేందుకు సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా. జి. కిషన్ సూచించారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు ప్రక్రియపై సమాచారం కోసం 08779249607,73829 29617 నంబర్లలో సంప్రదించాలని కళాశాల యాజమాన్యం సూచించింది.

## చౌక దుకాణాలలో పంచదార కట్!

– ఒకటిన్నర సంవత్సరం ముందే కందిపప్పు కట్ ఇప్పుడు పంచదార కట్

**పాకాల, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



మండలంలోని రేషన్ దుకాణాలలో ఈ నెల పంపిణీ చేస్తున్న నిత్యవసరాల సరుకులలో భాగంగా ఈనెల పంచదార ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెల నుండి పంచదార ఇవ్వము అని ముందుగా రాష్ట్ర ప్రభుత్వం నుండి పౌర సరఫరాల శాఖ నుంచి బహిరంగ ప్రకటన ఏమి రాలేదు కదా అని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పంచదార ధర అనూహ్యంగా కేజీకి 70 రూపాయలకు పెరగటమే దీనికి ఒక కారణం అయి ఉండవచ్చు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సెప్టెంబరు నెల కోటాలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే పంచదార చౌక దుకాణాలకే రాలేదా, అసలు గోడౌన్ కే రాలేదా, లేక ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావమా, ప్రభుత్వం నుంచి గోడౌన్ కు పంపిణీ జరగలేదా.. లేదు మధ్యలో అధికారులు, డీలర్ల చేతివాటం వల్ల పంచదార మాయం అయిపోయిందా అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పేదలకు కందిపప్పు 1 కేజీ ఇవ్వాల్సి ఉండగా దానిని ఎప్పుడో ఒకటిన్నర సంవత్సరం ముందే ఆపేసారు. కేవలం, కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు పంపిణీ చేయమని సరఫరా చేసే ఉచిత బియ్యాన్ని మాత్రం దయతలిచి, పోతే పోనీ అని ప్రస్తుతం ఇస్తున్నారు. ఈ సమస్య పై సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారిని ప్రతిస్పందించ వలసినదిగా చరవాణి ద్వారా కోరగా సదరు అధికారి వినూత్న రీతిలో పంచదారపై తమకేమీ సమాచారం లేదు అని, కిందిస్థాయి సిబ్బందిని కనుక్కొని తరువాత తాపీగా చెబుతాను అని చెప్పడం కొసమెరుపు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: మండలంలో దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం ఫిన్లాండ్ విద్యా అధ్యయన పర్యటనను విజయవంతంగా ముగించుకుని వచ్చిన సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ, పూర్వ విద్యార్థులు పాఠశాల లో మంగళ వారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎగువ సాంబయ్య పాళెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి మాట్లాడుతూ జిల్లా నుండి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం ఫిన్ లాండ్ విద్యా అధ్యయన పర్యటనకు ఎంపిక కావడం మండలం మరియు సాంబయ్య పాళెం పాఠశాలకే గర్వకారణం అని విద్యా వ్యవస్థ లో విప్లవాత్మకమైన మార్పులకు కృషి చేయాలని ఆకాంక్షించారు.బాలు మాట్లాడుతూ తనకీ అవకాశం కల్గించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి , రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ కి అలాగే ప్రోత్సాహం ఇచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారులకు,మండల శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియచేసారు.విద్యా పురోభివృద్ధి కి తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమం లో మంగీలాల్,శివ,మాతయ్య, మాధవి, పద్మ, సుబ్బమ్మ,ఆది లక్ష్మి,ఉషా,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**

పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు,అలంకారాలు చేపట్టారు. ఆలయంలోని 16కాళ్ళ మండపం వద్ద వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని దిగువ సన్నిధివీధిలోనూ ఆంజనేయ స్వామి ఆలయాలు వెలసినాయి. కాగా పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. మంగళవారం ఆలయంలోని 16కాళ్ళ మండపంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు తులసీ సారథ్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.మంగళవారం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. తరువాత స్వామి వారికి ఆలయ ఇఒ బికె వెంకటేశు సంకల్పంతో హారతులిచ్చారు.

## ఆటో కార్మికుల సమీక్షా సమావేశం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**




ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్టియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఐఎఫ్టియు కార్యాలయంలో ఐఎఫ్టియు అనుబంధ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆటో కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆటో కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, ఆటో విడిభాగాల ధరలు, పెరుగుతున్న నిర్వహణ ఖర్చులతో ఆటో కార్మికుల కుటుంబాలపై ఆర్థిక భారం రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని పోషించడమే భారంగా మారిందని అన్నారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో శాశ్వత ఆటో స్టాండ్లను ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు జి. భారతి, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. జాకీర్, ఐఎఫ్టియు నాయకులు సురేష్, మూర్తి, రంగా, శివా, మునిరత్నంపాల్గొన్నారు.

## ఎండిన వరి పంటకు పరిహారం ఇవ్వాలి : రైతు సంఘం డిమాండ్

**తొట్టంబేడు,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తొట్టంబేడు మండలం చేమూరు గ్రామంలో ఎండిపోతున్న వరి పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగెరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా తూర్పు మండలాల్లో ఇప్పటికే వ్యవసాయం కుంటుపడిందని అన్నారు. పంట పెట్టేందుకే రైతులు సాహసం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు అప్పులు చేసి వరి పంట సాగు చేస్తే విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంటలు ఎండిపోవడం చాలా విచారకరమని పేర్కొన్నారు. చేమూరులో విద్యుత్ సరఫరాలో అంతరాయం, అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లనే వరి చేలు ఎండిపోయాయని రైతులు వాపోతున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఎండిపోయిన ప్రతి ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎస్వీయూలో 72వ వ్యవస్థాపక దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 72వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెప్టెంబరు 2న విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని వివిధ మహోన్నత వ్యక్తుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో ప్రధాన వేడుకలు ప్రారంభమవుతాయి.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి, పురోగతికి సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఘనంగా సన్మానించనున్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ తాతా నరసింగ రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆల్ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. తిమ్మప్ప, జాయింట్ రిజిస్ట్రార్ బి. చంద్రయ్య, ఎస్వీయూ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ గుర్రంకొండ, కార్యదర్శి ఎన్. సుబ్రహ్మణ్యం తదితరుల చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు.అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేయనున్నారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందించేలా లక్కీడిప్ నిర్వహించడంతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.విశ్వవిద్యాలయ చరిత్ర, ఘనతను చాటిచెప్పేలా 72వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు.

## నేతలచే మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం

**రామకుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు పత్ర నారాయణ, కామరాజు నాయక్, సీతాపతి, రామూర్తి, చిన్నికృష్ణ, చలపతి, గుర్రప్ప, కృష్ణానాయక్, రఫీ, రవిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గొర్రెల పెంపకదారుల ఎన్నికలు

**నింద్ర, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :**



మంగళవారం మండలంలోని శ్రీరామాపురం, ఐఆర్ కండ్రిగ గ్రామాలలో గొర్రెల పెంపకం ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగింది.ఈసందర్భంగా శ్రీరామాపురం శ్రీపడవేటమ్మ గొర్రెల పెంపకదారుల సహాకార సంఘం అధ్యక్షులు బి.మనోహార్‌నాయుడు, ఐఆర్ కండ్రిగ ఐఆర్ కండ్రిగ శ్రీవినాయక గొర్రెల పెంపకదారుల సహాకార సంఘం అధ్యక్షురాలు జి.నళినిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.శ్రీరామాపురం సెక్రటరీగా కె.మునస్వామి,ఐఆర్ కండ్రిగ సెక్రటరీ శాంతిబూషణం ఎన్నుకున్నారు.ఈకార్యక్రమంలో డాక్టర్ శివమూర్తి, నరేష్ తదితరులు పాల్గోన్నారు.

ఫైల్‌నేమ్ : నింద్ర 01 : 1.గొర్రెల పెంపక ఎన్నికలలో అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

**చంద్రగిరి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మండపం పల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. వెదురుకుప్పం మండలం, పాతగుంటకు చెందిన చిన్నమ్మ (58) తన కుమారుడు లోకనాథంతో కలసి ద్విచక్ర వాహనంపై మల్లయ్యపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో మండపం పల్లి వద్ద వరికోత వాహనం రావడంతో లోకనాధం తన వాహనాన్ని రోడ్డు ప్రక్కకు మళ్ళిస్తుండగా అదుపుతప్పడంతో చిన్నమ్మ క్రిందపడిపోయారు. సరిగ్గా ఇదే సమయంలో ఈ మార్గంలో వస్తున్న టిప్పర్ చక్రం ఆమె తలకు ఒకవైపున రాపిడి చేసుకుని వెళ్ళింది. దీంతో ఆమె తలకు బలమైన రక్త గాయం కావడంతో 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. తీవ్ర రక్తస్రావంతో ఆమె ప్రాణాపాయ స్థితిలో వున్నట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, దర్యాప్తు చేపట్టారు.

## ఇంటికి దీపం ఇల్లాలు

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**




సమాజ శ్రేయస్సు ధ్యేయంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు కార్పొరేట్ సామాజిక బాధ్యత క్రింద రాష్ట్రీయ సేవా సమితిరాస్, తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 221 మంది రాస్ పొదుపు సంఘాల మహిళలకు 15.03 లక్షల విలువైన కుట్టు మిషన్లను పంపిణీ చేయడమైనది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్య శ్రీదేవి శెట్టి చైర్మన్ , ప్రెసిడెంట్ ఆల్ ఇండియా లేడీస్ క్లబ్ వారు మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలని,ఇంటిని చక్కదిద్ద వలసిన బాధ్యత మహిళలదేనని పేద మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు, తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకొని ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ చిన్న సహకారం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. మహిళలకు,వృద్ధులు,వికలాంగులకు రాస్ అందిస్తున్న సేవలను కొనియాడారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ మహిళలలో పొదుపుతత్వాన్ని పెంపొందించి, చేతి పనులలో శిక్షణ అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో ఈ సేవలను మరింత మందికి విస్తరించడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అందించిన ఈ గొప్ప సహకారం సభ్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్పనా సతీష్ డి.జి.ఎం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ, . వి.నాగరాజు ప్రాజెక్ట్ డైరెక్టర్ రాస్ సిబ్బంది, 300 మంది మహిళలు పాల్గొన్నారు.

## మిషన్ వాత్సల్యలో ఖాళీ పోస్టుల భర్తీ

–మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**

తిరుపతి జిల్లాలోని మిషన్ వాత్సల్య పథకం పరిధిలోని చిల్డ్రన్ హోమ్, ఎస్ ఏ ఏ యూనిట్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి ఎస్. వసంతబాయి మంగళవారం తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబర్ 01 నుంచి సెప్టెంబర్ 10, 2026 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా స్వయంగా కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. పోస్టును బట్టి రూ.7,944 నుంచి రూ.18,536 వరకు వేతనం ఉంటుందన్నారు. సంబంధిత విద్యార్హతలు, అనుభవం, వయస్సు తదితర అర్హతలు నోటిఫికేషన్ ప్రకారం ఉంటాయని తెలిపారు. దరఖాస్తు రుసుముగా ఓసి అభ్యర్థులకు రూ.500, ఎస్సీ ఎస్టీ బీసీ అభ్యర్థులకు రూ.400 నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చిల్డ్రన్ హోమ్‌కు దగ్గరగా స్థానిక నివాసం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు ఫారం తదితర సమాచారం తిరుపతి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో జిల్లా కార్యాలయ నోటిస్ బోర్డులో అందుబాటులో ఉన్నాయన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

న్యాయ విజ్ఞాన సదస్సు అవగాహన




సత్యవేడు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త: సత్యవేడులోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విద్యా సదస్సు లో ప్రతి విద్యార్థి చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో తలెత్తే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొగలరని మండల న్యాయ సేవా సంఘం(ఎంఎల్ ఎస్‌సీ) ప్యానెల్ న్యాయవాది, బార్ సెక్రటరీ అడ్వకేట్ రాజా పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళావాలలోజాతీయ సేవా పథకం ఏన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టపరమైన హక్కులపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ రాజా మాట్లాడుతూ నిత్య జీవితంలో చట్టాల పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ర్యాగింగ్, నిరోధక చట్టాలు, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, రహదారి భద్రతా నియమాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు అధైర్యపడకుండా చట్టపరమైన మార్గాల్లోపరిష్కరించుకోవచ్చని, అర్హులైన పేదలకు మండల న్యాయసేవా సంఘం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన పౌరులుగా దేశ ప్రగతికి తోడ్పడాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుల్లో కోర్టు సిబ్బంది సంధ్య, కామర్స్ లెక్చరర్ సుధాకర్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి

**సత్యవేడు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:**



సత్యవేడు పరిధిలోని పాత పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ లీలా కృష్ణయ్య దుర్మరణం చెందినట్లు పేర్కొన్నారు. వివరాలు ఇలా....సత్యవేడు మండలం, నెల్లిమత్తు కండ్రిగ గ్రామం సమీపంలోని ఒక మూతబడిన పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకున్న రహదారి ప్రమాదంలో బి.లీలా కృష్ణయ్య(36) ఆటో డ్రైవర్ దుర్మరణం చెందినట్లు సత్యవేడు పోలీసులు తెలిపారు. మృతుడు సత్యవేడు మండలం మదనంబేడు గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. ఆయనకి వివాహమై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న సత్యవేడు ఎస్ఐ సాయినాథ్‌చౌదరి, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం వెంటనే ఆస్పత్రికి వెళ్లి బాధితుడి బంధువుల నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు(రిజిస్టర్) చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ఆధారాలుసేకరిస్తున్నామని, త్వరలోనే విచారణ పూర్తి చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సత్యవేడు పోలీసులు తెలిపారు.